క్లుప్తంగా

విద్యార్థినికి ట్యాబ్ అందజేత


ట్యాబ్ అందజేస్తున్న రాకేష్‌షెట్కార్

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం చీమల్‌పాడ్ గ్రామానికి చెందిన ఉప్పరి నందిని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. పైచదువుల కోసం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ శనివారం ఖేడ్‌లోని తన నివాసంలో నందిని తండ్రి ఉప్పరి భీమన్నకు ట్యాబ్‌ను అందజేశారు. నియోజకవర్గంలోని యువజన కాంగ్రెస్ బాధ్యులు శివపటేల్, నగేష్ చారి, సోఫీరహమాన్, సంతోష్, శివాజీ, మనోజ్, అనిల్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధి ఉస్మాన్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద శనివారం అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వంట గ్యాస్ లీకైన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలను రక్షించే విధానంపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట వాడకంతో ప్రయోజనం


విత్తనాలను పంపిణీ చేస్తున్న బుచ్చిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రైతులు పచ్చిరొట్ట ఎరువులను వాడటం వల్ల భూసారం పెరిగి తెగుళ్ల తగ్గి మంచి దిగుబడులు సాధించవచ్చని తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్‌లో జనుము, జీలుగ విత్తనాలను 50శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు మనోహర, ప్రసాద్, రాణి, సొసైటీ డైరెక్టర్‌లు రాజ్‌కుమార్, మోహన్‌రెడ్డి, లక్ష్మన్, రాజిరెడ్డి, కొల్లూరు మాజీ సర్పంచ్ యాదయ్యలు పాల్గొన్నారు.

సామాజిక సేవతో గుర్తింపు

నవ భారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షుడు శ్రీధర్


వీల్‌చైర్ అందజేసిన శ్రీధర్

పటాన్‌చెరు టౌన్: యువత సామాజిక సేవకు ముందుకు రావాలని నవ భారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ పిలుపునిచ్చారు. పట్టణానికి చెందిన రమేష్ కండర క్షీణత వ్యాధితో బాధపడుతూ వీల్ చైర్ లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయాన్ని టీఎండీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, డప్పు అరవింద్ దృష్టికి తీసుకెళ్లడంతో వారు వీల్‌చైర్ అందజేశారు. ముఖ్యఅతిథిగా శ్రీధర్ పాల్గొన్ని వీల్‌చైర్‌ను అందజేసిన అరవింద్‌ను అభినందించారు. కార్యక్రమంలో వెంకన్న, మణిరత్నం, కౌశిక్, అఖిల్, భాను, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

నూతన చర్చి ప్రారంభం


చర్చిని ప్రారంభిస్తున్న నగేష్‌షెట్కార్

నారాయణఖేడ్: మండలం పరిధి చాప్టా(కె)లో క్రైస్తవులు నూతనంగా నిర్మించుకున్న మెథడిస్టు ప్రార్థనా మందిరం (చర్చి)ని శనివారం ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, పీసీసీ సభ్యులు కర్నెశ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. చర్చి నిర్మాణానికి సహకారం అందించిన నగేష్‌షెట్కార్‌కు క్రైస్తవులు కృతజ్ఞతలు తెలిపారు. పాస్టర్ బాబురావు, నాయకులు నారాయణరెడ్డి, గోవింద్ రెడ్డి, బక్షిరాం, దత్తు, జైవంత్, వైద్యనాథ్, క్రైస్తవ పెద్దలు దావిద్, మాణిక్, రామప్ప, శేఖప్ప, నర్సప్ప పాల్గొన్నారు.

అస్తవ్యస్తం.. చెక్‌డ్యాంల నిర్వహణ

ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టని వైనం

- వృథాగా పోతున్న వరదనీరు
- మట్టిదిబ్బలు, పిచ్చి మొక్కలతో దర్శనం
- పట్టించుకోని అధికారులు


కంబాలపల్లిలో మరమ్మతులకు నోచుకోని చెక్‌డ్యాం

ఝరాసంగం(జహీరాబాద్): కురిసిన వర్షం నీరు వృథాగా పోకుండా ఎక్కడికక్కడ ఇంకిపోయేలా ప్రభుత్వం నీటి సంరక్షణ చర్యలు చేపట్టింది. భూగర్భ జలాలు పెంపొందించాలనే ఉద్దేశంతో నాడు నిర్మించిన చెక్‌డ్యాంలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో కురిసిన వర్షపు నీరు కాల్వల ద్వారా వృథాగా పోతుంది. ఏళ్లు గడుస్తున్నా నిర్వహణ మాత్రం పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా చెక్‌డ్యాంల నిర్వహణ, మరమ్మతులు చేపట్టకపోవటంతో శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారాయి.

దిగువకు వృథాగా వర్షం నీరు

పంట పొలాల పరిసర ప్రాంతాల్లో నిర్మించిన చెక్‌డ్యాంల నిర్మాణం సరిగ్గా లేకపోవడంతో వర్షం నీరు వృథాగా పోతుంది. జిల్లాలో కొన్ని సంవత్సరాలుగా వాటర్‌షెడ్, ఉపాధిహామీ పథకం, ఇరిగేషన్, మిషన్ కాకతీయ తదితర పథకాల ద్వారా చెక్‌డ్యాంలను నిర్మించారు. ఒక్కో చెక్ డ్యాం కోసం రూ. 40 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు నిధులు కేటాయించి నిర్మించారు. వీటి ద్వారా పరిసర ప్రాంతంలోని భూగర్భజలాలు వృద్ధి చెందటమే కాకుండా భూమిలో తేమశాతం అధికంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల చెక్‌డ్యాంలు కొట్టుకుపోయాయి. నేటికీ వాటికి మరమ్మతులు చేయలేదు. ఝరాసంగం మండలంలోని కంబాలపల్లి గ్రామ శివారులో గతంలో కురిసిన వర్షాల వరద ధాటికి చెక్ డ్యాంలు పగిలిపోయాయి. మరమ్మతు పనులు మాత్రం చేయలేదు. నిర్మాణం సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవటంతోనే కొట్టుకుపోయాయని రైతులు ఆరోపించారు. చాలా చోట్ల పూడికతీత పనులు చేపట్టకపోవటంతో మట్టి దిబ్బలు, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. దీంతో పై నుంచి వచ్చిన నీరు పంట పొలాల్లోకి వెళ్లడంతో పంట నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. చాలా చోట్ల బీటలు వారాయి. మరమ్మతులు చేపట్టకపోతే అవి కూడా తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిర్వహణ పట్టించుకోని అధికారులు


కుప్పానగర్ గ్రామ శివారులో.. మట్టి దిబ్బలు, పిచ్చి మొక్కలతో నిండిన చెక్‌డ్యాం

చెక్‌డ్యాంల మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉపాధిహామీ పథకంలో పూడికతీత పనులు చేపట్టేవారు. పలు కారణాలతో ఆ పనులు కూడా తొలగించారు. పూడికతీత పనులు చేపట్టడంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెంపొందిన సందర్భాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకొని మరమ్మతులు చేపట్టి నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

లబ్ధిదారుల ఎంపిక త్వరగా చేపట్టండి


సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రక్రియ, రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హులను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎంపిక చేసి త్వరగా ప్రొసీడింగ్ పత్రాలు అందించాలన్నారు. అలాగే, రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఆయా మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కల్హేర్ మండలానికి చెందిన భాగ్యలక్ష్మికి సీఎం సహాయనిధి నుంచి ఆస్పత్రి ఖర్చుల కోసం రూ.56 వేల చెక్కు మంజూరయింది. సంబంధించిన చెక్కును శనివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అర్హులైన పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ ఎంపీపీ రమేష్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

చీరలే రక్ష!


పస్తాపూర్ వద్ద పొలం చుట్టూ కట్టిన చీరలు

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలో రైతులు పంటలను అడవి పందుల బెడద నుంచి రక్షించుకోవడానికి పొలం చుట్టూ చీరలు కట్టుతున్నారు. పస్తాపూర్‌కు చెందిన ఓ రైతు మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు చీరలు చుట్టాడు. కరెంట్ తీగల వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఇలా చీరలను కట్టి పంటను రక్షించుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వంలో అన్నీ అరాచకాలే

ఆర్యవైశ్య సంఘం నేత జగదీశ్వర్ గుప్తా


వీరభద్రుడిని దర్శించుకున్న జగదీశ్వర్‌గుప్తా దంపతులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీలోని బొంతపల్లి భద్రకాళి సమేత వీరభద్రస్వామి పుణ్యక్షేత్రాన్ని ఆర్యవైశ్య సంఘం నాయకుడు జగదీశ్వర్ గుప్తా కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, రెడ్‌బుక్ రాజ్యాంగం, పోలీసుల హింస, అక్రమ కేసులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లోని విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు మారాయని ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుమ్మడిదల ఏడీఈ ఫోన్ నంబర్ 8712473235, బొంతపల్లి ఏఈ 8712 473244, జిన్నారం ఏఈ 8712 473243 కొత్త నంబర్లను ప్రకటించారు. వినియోగదారులు కొత్త నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

◆ ఉచిత వైద్య శిబిరం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం కాంటినెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి.. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మేనేజర్ అఖిల్, ఆర్ఓ వెంకటరామయ్య పాల్గొన్నారు.

◆ ఆర్థిక సహాయం అందజేత

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రేజింతల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మొహమ్మద్ కుత్బొద్దీన్ బీద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. గ్రామంలో పేద కుటుంబాలకు చెందిన ఆడపిల్ల వివాహం జరిగితే తనవంతు సహాయంగా రూ.10 వేలు వరకు ఆర్థిక సహాయం అందజేస్తూ వస్తున్నారు. గ్రామానికి చెందిన బేగరి లక్ష్మమ్మ–నాగప్పల కనిష్ట పుత్రికకు వివాహం శుక్రవారం జరిగింది. వివాహానికి వెళ్లిన కుత్బొద్దీన్ వధువుకు రూ.10వేలు చెక్కు అందజేశారు.

◆ విద్యుత్ షాక్‌తో గేదె మృతి

న్యాల్‌కల్ (జహీరాబాద్): విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని రేజింతల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇబ్రహీం రోజులాగే శుక్రవారం సాయంత్రం గేదెను మేత మేపేందుకు తీసుకెళ్లాడు. గ్రామ సమీపంలో సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మేత మేస్తున్న క్రమంలో గేదే విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ. 30వేలకు పైగా ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

రేపటి నుంచి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

అందోల్ మండల వ్యవసాయ అధికారి శ్రీహరి

జోగిపేట(అందోల్): మండలంలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం–2 , పీఏసీఎస్ అందోల్‌లో రైతులకు 50 శాతం రాయితీపై జీలుగ విత్తనాలను సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నా విత్తనాలను రైతులు వినియోగం చేసుకోవాలని కోరారు. మండలానికి 150 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రైతులు సంబంధిత వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించి పర్మిట్ రాయించుకొని ఏఆర్ఎస్‌కే 2 , పీఏసీఎస్ అందోల్‌కు వచ్చి రాయితీ పోను జీలుగ (30 కిలోల) బస్తాకు రూ.2137.50లు చెల్లించి తీసుకోవాలన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు భూమి పట్టాపాస్ బుక్ జీరాక్స్, ఆధార్ కార్డు జీరాక్స్‌ను తీసుకురావాలని సూచించారు.

కారును ధ్వంసం చేసిన దుండగులు


కారును పరిశీలిస్తున్న పోలీసులు

నారాయణఖేడ్: బహుజన చైతన్య వేదిక సంస్థ వ్యవస్థాపకులు, న్యాయవాది అలిగే జీవన్ కుమార్‌కు సంబంధించిన కారును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మండలం పరిధి జూకల్‌లో శుక్రవారం జరిగిన ఓ వివాహానికి వెళ్లి రాత్రి అక్కడే ఉన్న ఖాళీ స్థలంలో కారును పార్క్ చేశారు. శనివారం ఉదయం కారు వద్దకు వెళ్లి చూడగా కారు అద్దాలు పగిలిపోయి కనిపించాయి. తన కారును ఎవరో ధ్వంసం చేశారని ఖేడ్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కారును పరిశీలించి కేసు నమోదు చేశారు.


హత్నూర (సంగారెడ్డి): జీలుగ విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

జీలుగలు దొరకక ఇబ్బందులు

హత్నూర(సంగారెడ్డి): మండలంలో జీలుగలు సరిపడా రాకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. శనివారం మండలానికి 250 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు రావడంతో హత్నూర సొసైటీ, దౌల్తాబాద్, చింతల్ చెరువు గ్రామాల రైతులకు పంపిణీ చేశారు. జీలుగ విత్తనాలు వచ్చాయన్నా సమాచారంతో రైతులు ఉదయం నుంచే బారులు తీరారు. సరిపడా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలు సరిపడా అందించాలని లేకుంటే భూసారం దెబ్బతింటుందని వాపోయారు. ఈ విషయమై మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌ను సాక్షి వివరణ కోరగా వచ్చిన విత్తనాలను రైతులకు అందించామని తిరిగి ప్రభుత్వం పంపిణీ చేస్తే అందిస్తామని తెలిపారు.

ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదం

జహీరాబాద్: పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జహీరాబాద్ లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని అహ్మద్‌నగర్ కాలనీకి చెందిన ఖాజా(42) అనే వ్యక్తి మొగుడంపల్లి వైపు నుంచి జహీరాబాద్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైనుంచి ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్‌లో వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

డిపో మేనేజర్ ఉపేందర్



సంగారెడ్డి టౌన్: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ అన్నారు. శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు సందేశాలు తెలిపారు. కంది నుంచి వీరన్నచారి మాట్లాడుతూ.. కంది డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలన్నారు. పోచారం నుంచి బాలయ్య మాట్లాడుతూ.. జోగిపేట నుంచి పోచారం స్కూల్ టైంలో కాకుండా పోచారానికి అదనంగా ఒక ట్రిప్పు ఉదయం, సాయంత్రం వేళలో నడపాలని కోరారు. రేగోడు నుంచి మాణిక్య ప్రభు మాట్లాడుతూ.. సంగారెడ్డి నుంచి రేగోడుకి ఉ.10 గంటలకు అదనపు బస్సు నడపాలన్నారు. సంగారెడ్డి నుంచి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. రాత్రి 11 గంటలకు పటాన్‌చెరు నుంచి సంగారెడ్డికి బస్సులు నడపాలని విన్నవించారు. పోతులబోగుడ నుంచి దిగంబర్ మాట్లాడుతూ.. సంగారెడ్డి నుంచి పోతులబోగుడ, వట్టిపల్లి, బోరంచకు రాత్రి వేళల్లో బస్సులు నడపాలన్నారు. వచ్చిన ఫిర్యాదులను త్వరలోనే పరిష్కరిస్తామని డిపో మేనేజర్ ఉపేందర్ చెప్పారు. కార్యక్రమంలో డిపో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాయసముద్రం చెరువు సందర్శన


చెరువును పరిశీలిస్తున్న అధికారులు, పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువును శనివారం హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ ఇరిగేషన్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ.. కొద్ది రోజుల క్రితం చెరువు అభివృద్ధి విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసి వినతిపత్రం అందించామన్నారు. అందులో భాగంగా అధికారులు రాయసముద్రం చెరువును సందర్శించారు. హైదరాబాద్‌లోని దుర్గం చెరువు మాదిరిగా ఈ చెరువును అభివృద్ధి చేస్తామని ఆమె వివరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ నళిని, హెచ్ఎండీఏ డీఈ జగన్‌మోహన్, స్థానికులు చంద్రశేఖర్ గుప్తా, వాస్‌దేవ్, చిగురు శ్రీనివాస్ పాల్గొన్నారు.


నవగ్రహాల పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నవగ్రహాల పూజ

మునిపల్లి, (అందోల్): ఎల్లమ్మ అమ్మవారి ఆలయ 4వ వార్షికోత్సవంలో భాగంగా దేవాలయంలో నవగ్రహాల పూజా కార్యక్రమం నిర్వహించారు. శనివారం మండలంలోని బోడపల్లి గ్రామ శివారులో ఎల్లమ్మకు బసంత్‌గౌడ్ కుటుంబ సభ్యులు నవగ్రహాల పూజలు చేశారు. ఆదివారం ఉ.11 గంటలకు అమ్మవారికి కల్యాణం నిర్వహిస్తామని బసంత్‌గౌడ్ కుటుంబ సభ్యులు తెలిపారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- సిద్ధం చేసుకుంటున్న విత్తనాలు, ఎరువులు
- రైతు భరోసా కోసం ఎదురుచూపు


దుక్కులు దున్నుతున్న రైతు

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గం రైతులు వానాకాలం పంటలు సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈసారి ఋతు పవనాలు తొందరగానే వస్తున్నాయన్న సమాచారంతో పొలాలను దున్ని విత్తనాలు, ఎరువుల సిద్ధం చేసుకుంటున్నారు. వ్యవసాయ అధికారుల సూచించిన మేరకు పంటలను సాగు చేయాలని రైతులు నిర్ణయించారు. జహీరాబాద్ మండలంలో 14,992 మంది రైతులు ఉండగా.. ఝరాసంగం మండలంలో 13,908 మంది, కోహీర్ మండలంలో 13,780 మంది , మొగుడంపల్లి మండలంలో 10,217 మంది, న్యాల్‌కల్ మండలంలో16,955 మంది రైతులు ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా పత్తి, కంది, పెసర, మినుము, సోయాబిన్ తదితర పంటలను రైతులు పండిస్తుంటారు. పంటల సాగుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సిద్ధం చేసుకోవడానికి పెట్టుబడికి డబ్బులు ముందుగానే సమకూర్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. రైతు భరోసా డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించి 4 ఎకరాలపై బడిన రైతులకు ఇంతవరకు రైతు భరోసా డబ్బులు వేయలేదు. రైతులంతా పెట్టుబడి సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. పంటల సాగుకు ప్రభుత్వం రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

విద్యా ప్రమాణాల మెరుగు కోసమే శిక్షణ


మునిపల్లి : మాట్లాడుతున్న ఎంఈఓ భీంసింగ్

కొండాపూర్ (సంగారెడ్డి): ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని పాఠశాలస్థాయిలో విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలని మండల విద్యాధికారి దశరథ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మల్కాపూర్‌లోని ప్రైవేట్ పాఠశాలలో జరిగిన శిక్షణ కార్యక్రమం ముగిసింది. శిక్షణలో భాగంగా సంయుక్త స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ.. కాలానుగుణంగా మారుతున్న సిలబస్ ఆధారంగా ఉపాధ్యాయులు మెలకువలు, నైపుణ్యం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్లు జ్యోతి, ఆనందం పాల్గొన్నారు.

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల సాధనకు కృషి చేయాలని ఎంఈఓ భీంసింగ్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగిసింది. ఆయన మాట్లాడుతూ.. కాలానుగుణంగా ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకుని గతంలో మాదిరి కాకుండా తెలుగు, ఆంగ్లం, గణితం, విజ్ఞానం వంటి అన్ని విషయాలపై శిక్షణ ఇచ్చారు.

నాణ్యమైన విద్యనందించాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలని ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. మండలంలోని మిర్జాపూర్(బి)లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్‌పై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. శిక్షణా తరగతులకు హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలు తరగతి గదిలో అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.

గడ్డపోతారం మున్సిపాలిటీలోని..

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీలోని చెట్లపోతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ ముగిసింది. బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంఈఓ కుమారస్వామి మాట్లాడుతూ.. నిరంతరాయంగా ఉపాధ్యాయులు నిత్య విద్యార్థుల వలె బోధన పద్ధతులను నేర్చుకుంటూ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులలో మెలకువలు నేర్పించాలన్నారు. సీఐ మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధికి విద్యాశాఖ ద్వారా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. ఎంఈఓ వెంకటేశం మాట్లాడుతూ.. విద్యలో నాణ్యత పెంచేందుకు నిర్వహించిన ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు సులభ పద్ధతిలో అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు.